క్లుప్తంగా

బీసీ మహిళపై కుట్ర

ఆత్మకూరు : గీసుకొండ ఎంపీపీ భీమగాని సౌజన్య బీసీ మహిళ కావడం వల్లే అవిశ్వాస తీర్మానం పెట్టారని మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు కావాలనే సౌజన్యపై అవిశ్వాసం పెట్టారన్నారు. గతంలో కూడా ఇదే విధంగా అధికారంతో ఇబ్బందులకు గురిచేశారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, అలువాల రవి, తనుగుల సందీప్, పెరుమాండ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శలు..

పరకాల: వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి తండ్రి సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
కమలాపూర్: మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన ముష్క శ్రీకాంత్ ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను కరీంనగర్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి గురువారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించి ఓదార్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేశ్‌గౌడ్, హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ పాడేటి భిక్షపతి, నాయకులు శివకృష్ణ, శ్రీరాములపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు తాటిపాముల రాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోల్కొండ సదానందం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
దామెర: మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన దామెర భద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా విషయం తెలుసుకున్న సూర్య ట్రస్ట్ చైర్మన్, ఆత్మకూర్ ఏఎంసీ వైస్ చైర్మన్ గజ్జి విష్ణు గురువారం భద్రయ్య భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భద్రయ్య కుటుంబ సభ్యులను ఓదార్చి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట కర్ణాకర్, మహేష్, రాజు, సైలాన్, దయాకర్, సాయి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



పరకాల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్వకర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా బ్యాగులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎదులాపురం కార్తీక్, కౌన్సిలర్ మడికొండ సంపత్, ప్రధానోపాధ్యాయురాలు బేరి మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్యపురం రైల్వే గేట్ మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సమీపంలోని డీజిల్ లోకోషెడ్ పక్కన ఉన్న అయోధ్యపురం రైల్వే గేట్ నంబర్ 58ని నాలుగు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. మేజర్ రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు మూసి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు.

నేడు ఓసిటీలో జరగనున్న ఎమ్మార్పీఎస్ సభ వాయిదా

కాశిబుగ్గ: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ ఓసిటీ మైదానంలో శుక్రవారం జరగనున్న ఆవిర్భావ మహాసభ అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని ఎమ్మెస్పీ తూర్పు కోఆర్డినేటర్ ఈర్ల కుమార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బ్యాడ్మింటన్ నేషనల్ పోటీలకు భువనేశ్వర్ ఎంపిక

వరంగల్ అర్బన్: ఒడిశాలో జరగనున్న నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు భువనేశ్వర్ ఎంపికయ్యారు. వరంగల్ బల్దియా ఇండోర్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న భువనేశ్వర్.. పలుమార్లు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై కోచ్ శ్రీధర్, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

కాజీపేట: రైల్వే వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక నిరుద్యోగ యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బండారి సురేందర్ మాదిగ మాట్లాడుతూ వరంగల్ సభలో పీఎం నరేంద్రమోదీ ప్రకటించేలా బీజేపీ రాష్ట్ర నాయకత్వం చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గద్దం అశోక్, బొల్లికొండ కోటి, పిల్లి క్రిష్టఫర్, కుమ్మరి శ్రీనివాస్, రేణుకుంట్ల ఉమామహేష్ పాల్గొన్నారు.

‘గురుకులం’లో గంపెడు సమస్యలు

- నిద్రిస్తున్న నిఘా నేత్రాలు
- ఉపాధ్యాయుల సమయపాలన కరువు
- క్రీడా మైదానంలో చెత్త డంపు



తెలంగాణ క్రీడా మైదానం ఆవరణంలో పడేసిన చెత్తా, చెదారం

శాయంపేట: విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నామని, అన్ని సౌకర్యాలు, సదుపాయాలు, భద్రతలు కల్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలవ్వడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులు, క్రమశిక్షణ నేర్పాల్సిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులకు హాజరవ్వడంతో విద్యార్థినులు విద్యాబోధనకు దూరమవుతున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో బాలుర సంఖ్య తగ్గిపోవడంతో ఇక్కడి విద్యార్థులను దామెర మండలం పులుకుర్తి వసతి గృహానికి తరలించారు. ఈ భవనం ఖాళీగా ఉండడంతో భూపాలపల్లి సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహంగా కేటాయించారు. ప్రస్తుతం ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులు దాదాపు 550 మంది విద్యనభ్యసిస్తున్నారు.

ఇష్టానుసారంగా విధులు, పనిచేయని సీసీ కెమెరాలు

సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రిన్సిపల్ సుభాషినిదేవితో పాటు కొందరు ఉపాధ్యాయులు హనుమకొండ పట్టణం నుంచి అప్‌అన్‌డౌన్ చేస్తు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే విద్యార్థినుల భద్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు గత కొంత కాలంగా పని చేయకుండా ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థినులు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో రక్షణగా ఉండే సీసీ కెమెరాలను మరమ్మతులు చేపించకుండా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పాఠశాలలోని చెత్తా, చెదారం పాఠశాలకు ఎదుగురుగా ఉన్న తెలంగాణ క్రీడా మైదానం ఆవరణలో నిప్పు పెట్టడంతో పక్కనే ఉన్న చెట్లు కాలిపోయి ఎండిపోతున్నాయని ప్రకృతి ప్రేమికులు ఆగ్రహిస్తున్నారు. ఉన్నాతాధికారులు చొరవ చూపి ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా చూడాలని, సీసీ కెమెరాల మరమ్మతు చేపట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పడిపోయేలా ఉన్న చెట్టు



కాలిపోయిన చెట్టు మొదలు

అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ రావాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి

ఎల్కతుర్తి: పట్టణాలతో పాటు గ్రామాలు అభివృద్ధి బాటలో పరుగులు పెట్టాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని, అవినీతి భారీగా పెరిగిందని విమర్శించారు. భీమదేవరపల్లి మండలం గాంధీనగర్, మాణిక్యాపూర్ గ్రామాల్లో పల్లెపల్లెకు ప్రవీణన్న..గడుప గడుపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ కూడలిలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి తప్పితే కొత్తగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. నియోజకవర్గంలో 10 వేల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇళ్ళు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే ఓట్ల కోసమే పనిచేస్తున్నారని, పేదప్రజలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎన్ని ఇచ్చావో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నెరవేర్చబోయో పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్‌ముఖర్జీ, గడ్డం కనుకయ్య, సదానందం, రామచంద్రం, సుదర్శన్ రెడ్డి, రవీందర్, సారయ్య, తిరుపతిగౌడ్, మొగిలయ్య, రామారావు, అయిలయ్య, రాజిరెడ్డి, బుచ్చయ్య, భీంరెడ్డి, శంకర్, గోపి, చంద్రమౌళి, పవన్, రాజు, సుమలత, విజయలక్ష్మి, ఉపేంద్ర, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఎల్కతుర్తి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని స్థానిక సర్పంచ్ కొమ్మిడి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో హరితహారంలో భాగంగా గురువారం ఉపాధిహామీ కూలీలతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన అవి వృక్షాలుగా ఎదిగి మానవాళి మనుగడకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తిరుపతి, ఉపాధిహామి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

హరితహారంలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

శాయంపేట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి కోరారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలోని గురువారం మండలంలో చేపట్టనున్న హరితహారంపై ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. వర్షాలు సమృద్ధిగా పడుతుండడంతో ప్రతీ గ్రామంలో మొక్కలు నాటడానికి గుంతలు తీయాలని సూచించారు. అవెన్యూ ప్లాంటేషన్, మల్టీ లేయర్, డంపింగ్ యార్డ్, స్మశాన వాటికల వద్ద బయో పెన్సింగ్, దేవాలయాలు, మసీదు, చర్చి, ప్రభుత్వ స్థలాల్లో కమ్యూనిటీ ప్లాంటేషన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కీర్తి అనిత, ఉపాధి హామి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏడీ రాఘవరావు

శాయంపేట: మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం కార్మికులకు గురువారం తెలంగాణ జౌళీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత జౌళీ శాఖ ఏడీ రాఘవరావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికులకు చేనేత మిత్ర, చేనేత బీమా పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. చేనేత కార్మికులకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో చాలా మంది నిరుపేద కార్మికులు లబ్ధిపొందుతున్నారని అన్నారు. జౌళీశాఖ అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీవోలు బొట్టు వెంకటేశ్వర్లు, బిజ్జ వెంకటేశ్వర్లు, డీఎంవో హరిప్రసాద్, టీఏ రాజేష్, చేనేత సహకార సంఘం పీఏసీ సభ్యులు బాసాని సాంబయ్య, లక్ష్మినారాయణ, సమ్మయ్య, ప్రభాకర్, బాసాని పద్మ, కొప్పుల సంఘం పీఏసీ చైర్మన్ దాసరి కుమారస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మాట్లాడుతున్న నాబార్డ్ జిల్లా మేనేజర్

కమలాపూర్: మహిళలు ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంపొదించుకొని కుటీర పరిశ్రమలు ఏర్పచుకొని ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో నాబార్డ్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో మహిళల జీవనోపాదులు, వ్యాపార సంస్థల అభివృద్ధిపై గురువారం మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మార్కెట్‌లో టమాటో, సాస్, చిల్లీ సాస్, చిరు ధాన్యాలతో బిస్కెట్, మాంసం పచ్చళ్లకు మంచి గిరాకీ ఉందని అన్నారు. మహిళలు ఈ శిక్షణలో భాగంగా మార్కెటింగ్ మెలుకువలు, ఫుడ్ ప్రాసెసింగ్ లైసెన్సు, బ్రాండింగ్, ప్యాకేజింగ్ అంశాలను నేర్చుకోవాలన్నారు. చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పచుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫార్మాలైజేషన్ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) ద్వారా రుణాలు అందిస్తోందన్నారు. మహిళలందరూ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో స్థిరపడాలని కోరారు. అనంతరం నాబార్డ్ ప్రాంతీయ కార్యాలయం డెవలప్‌మెంట్ అసోసియేట్ శాస్మిత నవీన మహిళల ట్రైనింగ్‌కు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సిబ్బంది కవిరాజ్, అక్తర్, షరీఫ్, స్వయం సహాయక సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి



ముల్కనూర్: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెస్పీ నాయకులు

పరకాల: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతిని బీఆర్ఎస్ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అమరధామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పరకాల పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, నాయకులు రాజమౌళి, శ్రీనివాస్, రఘుపతి, అనిల్, బిక్షపతి, వెంకటేష్, తిరుపతి, శ్రీనివాస్, శేఖర్, బొచ్చు రమేష్ పాల్గొన్నారు.
ఎల్కతుర్తి: భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 37వ వర్ధంతిని ముల్కనూర్, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో ఎమ్మెస్పీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటస్వామి, సురేష్, రమేష్, రమేష్, రాజు, మహేందర్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కమలాపూర్: బ్రాహ్మణుల ఆత్మగౌరవం, హక్కుల సాధనే ధ్యేయంగా ఈనెల 9వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన బ్రహ్మ గర్జన సభను విజయవంతం చేయాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు, హనుమకొండ జిల్లా కన్వీనర్ విష్ణుదాసు వంశీధర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం బ్రహ్మ గర్జన సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్రాహ్మణ అని చెప్పుకునేందుకు భయపడాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వ పథకాలు అమలవ్వడం లేదని, రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అనగదొక్కబడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మ గర్జన సభకు సంఘాలకు అతీతంగా బ్రాహ్మణులంతా అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం



కమలాపూర్: మాట్లాడుతున్న నాయకులు



ఎల్కతుర్తి: సమ్మె చేపట్టిన జీపీ కార్మికులు



దామెర: సమ్మెలో పాల్గొన్న జీపీ సిబ్బంది

కమలాపూర్: రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు సమ్మె బాట పట్టారు. ఈ సమ్మెకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి అశోక్‌లు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బంది మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని కారోబర్లు, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్‌లు, డ్రైవర్లు, సిబ్బంది సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌లు మాట్లాడుతూ కనీస వేతనాల అమలు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. జీవో 51ను సవరణ చేసి మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. పంచాయతీ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన గ్రామపంచాయతీ కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్‌పై ప్రభుత్వం స్పందించి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మిక, ఉద్యోగ సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు ఐలయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జీపీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో జీపీ ఉద్యోగ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జీపీ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడెల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలన్నారు. పంచాయతీ కార్మికుల వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీల ద్వారా వేతనాలు అందించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, గ్రాడ్యూటీ గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. విధి నిర్వాహణలో ప్రమాదవశాత్తు మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600 వేతనం చెల్లించాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. జీవో 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరిలన్నింటినీ యదావిధిగా కొనసాగించాలన్నారు. 2011 జనాభా ప్రకారం కాకుండా అవరాన్ని ప్రతిపాదికన కార్మికులను తీసుకోవాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు కుడితాటి రవీందర్, సునీల్, కుమార్, థామస్, కుమారస్వామి, కిష్టయ్య, శ్రీనివాస్, సారయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: గ్రామ పంచాయితీల్లో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జీపీ సిబ్బంది చేపడుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో గురువారం పంచాయతీ సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు గ్రామాల అభివృద్ధిలో ముఖ్య భూమిక పోశిస్తున్న తమను ప్రభుత్వం గుర్తించి పర్మనెంట్ చేయాలన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన సిబ్బందికి రూ. 10 లక్షల ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. 11 పీఆర్సీ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. దండ్రె దేవేందర్, మాదారపు బొబ్బిలి, యజ్ఞం సురేష్, గోవిందు ఆనంద్, భద్రయ్య, నాగరాజు, రాజ్‌కుమార్, చిరంజీవి, సుమన్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న కౌన్సిలర్ సుధ

వరంగల్ అర్బన్: మహిళలు, బాలికల సమస్యలు, హక్కులు, బాలబాలికల చట్టాల రక్షణ చట్టాలు, ఫోక్స్ యాక్ట్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం కౌన్సిలర్ సుధ అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో ఎస్ఎల్ఎఫ్ కస్టర్లకు మహిళా చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి కేంద్రంలో బాధిత మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవలను వివరించారు. బాధిత మహిళ రక్షణ, భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజ్‌కుమార్, నిర్మలాదేవి పాల్గొన్నారు.

పాలాభిషేకం చేసిన 'ఈటల'

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి కార్యకర్తలు, నాయకులతో కలిసి బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ గురువారం సాయంత్రం పాలాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, చిర్ర నర్సింగ్‌గౌడ్, గుంటి కుమారస్వామి, చాంద్‌పాషా, సుంచు వేణుకుమార్ పాల్గొన్నారు.

భర్తతో గొడవపడి.. ఇంటి నుంచి వెళ్లిపోయి..





ఇంట్లో నుంచి వెళ్లిపోయిన తల్లి, కుమారుడు

పరకాల: భర్తతో జరిగిన గొడవతో మనస్థాపం చెందిన భార్య తన కుమారుడితో సహా ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన నాంపల్లి పుష్పలీల, వెంకటయ్య చిన్న కుమార్తెను 20 ఏళ్ల క్రితం పరకాల మండలం మల్లక్కపేట గ్రామానికి చెందిన బానాల రాజుకు ఇచ్చి వివాహం చేశారు. భార్య భర్తల మధ్య గొడవ జరుగుతుండడంతో మనస్థాపం చెందిన పుష్పలీల ఈ నెల 4వ తేదీన తన కుమారుడు హనుమంతుతో బయటకు వెళ్లింది. మూడు రోజులుగా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీస్‌లు వెల్లడించారు.

హైదరాబాద్‌కు తరలిన సీపీఐ నాయకులు



ధర్నాకు తరలిన నాయకులు

ఎల్కతుర్తి: నిరుపేదలు వేసుకున్న గుడిసె స్థలాలకు ప్రభుత్వం 58వ జీవో ప్రకారం పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాకు మండలంలోని సీపీఐ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, స్థానిక మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నాయకులు నిమ్మల మనోహర్, కర్రె లక్ష్మణ్, మంచాల రమాదేవి, తిరుపతి, సుంచు కుమాస్వామి, కమ్మంపల్లి కిషన్, స్వప్న, ఉమా, మౌనిక, పద్మ, మమతలు వెళ్లిన వారిలో ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఐనవోలు: మండలంలోని ముల్కలగూడెం గ్రామానికి చెందిన బేతి కేశవరెడ్డి ఇటీవల మృతి చెందాడు. గురువారం నిర్వహించిన కేశవరెడ్డి దశ దినకర్మకు స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ హాజరయ్యారు. కేశవరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈటల రాజేందర్‌కు ఘన స్వాగతం



కరచాలనం చేస్తున్న ఈటల రాజేందర్

కమలాపూర్: హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులై గురువారం తొలిసారిగా కమలాపూర్ మండలానికి రాగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అంబాల, గూడూరు, కమలాపూర్‌లో మహిళలు హారతులతో స్వాగతం పలికి నుదుట తిలకం దిద్దారు. కమలాపూర్, గూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి బస్టాండ్ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ, తెలంగాణ తల్లి విగ్రహాలకు ఆయన నివాళులర్పించారు.